పిల్లర్లు పూర్తయితే.. మెట్రో లేనట్లే!

ఎలివేటెడ్ కారిడార్ల పనులకు ముందే స్థానికుల స్పష్టత

- మెరుగైన ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ అవసరం
- మేడ్చల్, తూంకుంట వరకు మెట్రో విస్తరించాలి
- నార్త్ సిటీ మెట్రోకు పెరుగుతున్న డిమాండ్

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): నగరంలోని నార్త్ సిటీ మెట్రో విస్తరణకు అనూహ్యంగా రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోంది. నిత్యం లక్షన్నరకు పైగా నార్త్ సిటీలోని పలు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి ఎంతగానో ఉపయోగపడేలా మెట్రో విస్తరణ చేపట్టాలని కోరుతున్నారు. ఓ వైపు ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సులతో రవాణా సదుపాయాలు ఉన్నా.. మెరుగైన ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ ఈ ప్రాంతానికి అవసరమని స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో ప్రభుత్వం ఓ వైపు మెట్రో విస్తరణ, మరో వైపు నార్త్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలను అమలు చేస్తోంది. కానీ, ఈ రెండు ప్రాజెక్టులలో నార్త్ సిటీ స్థానికుల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండానే డిజైన్లు ఖరారు చేస్తోంది. ఇక ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చెప్పుకుంటున్న ఎలివేటెడ్ కారిడార్‌తోనూ ఈ ప్రాంతానికి అన్యాయం చేసేలా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్, తూంకుంట వరకు మెట్రో విస్తరించాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో, కేవలం ఎలివేటెడ్ కారిడార్‌తో చేతులు దులుపుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు. మెట్రో నిర్మాణంలో కీలకమైన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై స్పష్టత కోరుతున్నారు. ఎలివేటెడ్ పిల్లర్ల నిర్మాణం అయితే, భవిష్యత్తులో మెట్రో వచ్చే అవకాశం లేకుండా పోతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రెండో దశ మెట్రో విస్తరణలో..

మేడ్చల్, తూంకుంట వరకు మెట్రో విస్తరించాలనే డిమాండ్ కొంత కాలంగా పెరుగుతూనే ఉంది. రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. గతంలోనే ఈ ప్రతిపాదనలకు డిజైన్లు కూడా ఖరారు చేశారు. ఒక అంతస్తులో మెట్రో, మరో అంతస్తులో రోడ్ వే నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ, ఇప్పటివరకు కాంగ్రెస్ ఖరారు చేసిన డిజైన్లలో ఈ ప్రతిపాదనలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే ఇప్పుడు స్థానికులను కూడా ఆందోళనకు గురి చేస్తోంది. ఎలివేటెడ్ కారిడార్ పేరిట డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను పక్కనపెట్టే ప్రయత్నం జరుగుతుందని, అదే గనక జరిగితే భవిష్యత్తులో మెట్రో నిర్మాణం అసాధ్యంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 19 కిలోమీటర్ల మేర పొడువైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం ఓ వైపు భూసేకరణ పనులు జరుగుతుండగా, మరోవైపు డిజైన్లపై స్పష్టత లేకపోవడంతో స్థానికులు గందరగోళానికి గురవుతున్నారు.

రైట్ ఆఫ్ వే పేరిట తూట్లు...

నిజానికి మేడ్చల్ వరకు మెట్రో నిర్మించాలని స్థానికులు గడిచిన ఏడాదిగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయిలో మెట్రో నిర్మాణానికి ఉద్యమిస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్ శంకుస్థాపన కార్యక్రమంలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఎదుటనే మేడ్చల్ వరకు మెట్రో నిర్మించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. కానీ, ప్రభుత్వం దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో లక్షలాది మంది నగరవాసులకు రవాణా సదుపాయాలు అందించే ఈ ప్రతిపాదనల అంశం ప్రధాని మోదీ వరకు తీసుకెళ్లినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రెండో దశ మెట్రో విస్తరణలో ఈ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ప్రాంతాన్ని విస్మరిస్తూనే డీపీఆర్ రూపకల్పన చేసి కేంద్రానికి పంపింది. డీపీఆర్‌లో మేడ్చల్ ప్రాంతాన్ని చేర్చకుండా, మరోవైపు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుతో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను పక్కన పెట్టేలా హెచ్ఎండీఏ వ్యవహరిస్తుండటం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదే గనక జరిగితే.. భూసేకరణతోనే ఏళ్లు గడిచిన ఈ ప్రాంతానికి భవిష్యత్తులో మెట్రో నిర్మాణం సాధ్యం కాదన్నారు. ఇక మెట్రో వర్గాలు కూడా రైట్ ఆఫ్ వే లేదనే సాకుతో రెండో దశలో మేడ్చల్ వరకు మెట్రో ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదని తూట్లు పొడిచింది. ఈ క్రమంలో ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు పనులు ప్రారంభానికి ముందే, డబుల్ డెక్కర్ ప్రాజెక్టుపై, నార్త్ సిటీ మెట్రో నిర్మాణంపై స్పష్టతను ఇవ్వాలని కోరుతున్నారు.



యాదగిరిగుట్టలో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 9 : తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే గొప్ప సంకల్పంతో ఉద్యమ రథసారథి కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ దీక్ష చేపడితే అప్పటి కేంద్ర ప్రభుత్వం తలొగ్గి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గుర్తుచేశారు. విజయ్ దివస్‌లో భాగంగా సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ ఆనవాళ్లను తుడిచి వేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల కాదన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ఎంతో సేవ చేసిన కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగరాజు, మాజీ సర్పంచ్ తోట కూరి బీరయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బీస కిష్టంరాజు గౌడ్, సెక్రటరీ జనరల్ ఎర్ర మల్లేశ్, నాయకులు పత్తి వెంకటేశ్, బాలరాజు, కర్రె శేఖర్ పాల్గొన్నారు.

పద్మశ్రీ చింతకింది మల్లేశానికి సన్మానం

ఆలేరు టౌన్, డిసెంబర్ 9 : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని అమీర్‌పేట కమ్మసంఘంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆలేరు పట్టణానికి చెందిన ఆసు యంత్రం రూపకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశాన్ని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శాలువాతో సత్కరించారు.

చింతకింది మల్లేశాన్ని సత్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సహకరించాలి : కలెక్టర్

భువనగిరికలెక్టరేట్. డిసెంబర్ 9 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో జిల్లా ప్రజలందరూ పాల్గొని సరైన సమాచారం అందించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారి వివరాల సేకరణను మొబైల్ యాప్‌లో పొందుపరచడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా ఫొటో తీసుకుంటారని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ఇంటి స్థల ధ్రువీకరణ పత్రాలు, లబ్ధిదారుల ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ వివరాలు అందించాలని తెలిపారు. సందేహాలు ఏమైనా ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓను సంప్రదించాలని, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08685293312 నంబర్ లోనూ నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కలెక్టర్ హనుమంతరావు

సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణపై జీహెచ్ఎంసీ అలసత్వం!

ఏజెన్సీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు - గడువు ముగిసిన రెన్యూవల్ చేయకపోవడమే సమస్యకు కారణం?

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): కాంప్రిహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) పథకం నిర్వహణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నది. రహదారులపై గుంతలు ఏర్పడుతున్న ఏజెన్సీలపై పర్యవేక్షణ లేకపోగా, కనీసం జరిమానా విధింపు పట్టడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో సదరు ఏజెన్సీల గడువు ముగియగా, రెన్యూవల్ చేయలేదని, దీంతోనే నిర్వహణ గాడి తప్పిందన్న విమర్శలు లేకపోలేదు. ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా ప్రశ్నార్థకంగా మారింది. కాగా, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుంతలు లేని రహదారుల లక్ష్యంగా వాహనదారులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రధాన రహదారుల నిర్వహణలో భాగంగా 525 విభాగాలుగా విభజించి, తొలి విడతగా 811.958 కిలోమీటర్ల రహదారిని ప్రైవేట్ ఏజెన్సీలకు 2020వ సంవత్సరంలో నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దాదాపు రూ.1050 కోట్ల మేర ఖర్చు చేసి నిర్ణీత లక్ష్యాన్ని గతేడాది అక్టోబరులోనే చేరుకున్నారు. ఈ సీఆర్ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే సీఆర్ఎంపీ మోడల్ వివరాలను తీసుకోగా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌కు చెందిన పలు కార్పొరేషన్లు పురపాలక శాఖను సంప్రదించారు. ఇటువంటి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశ రూ. 696.71 కోట్ల ప్రతిపాదనలను పక్కన పెట్టడం, కనీసం మొదటి దశ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహణ చేపట్టకపోవడం గమనార్హం.

సీనియర్ సిటిజన్స్ డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11న డైరీ-2025ని ఆవిష్కరించనున్నారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, అవగాహన కల్పించేలా రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

జీహెచ్ఎంసీ ప్రజావాణికి 118 దరఖాస్తులు

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): ప్రజావాణి కార్యక్రమం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సోమవారం హెడ్ ఆఫీస్‌తో పాటు ఆరు జోన్లలో జరిగింది. పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. 118 ఫిర్యాదులను స్వీకరించగా, ఇందులో ప్రధాన కార్యాలయంలో 52 విన్నపాలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి 22, ఎఫ్ఏ సెక్షన్ 12, ట్యాక్స్ సెక్షన్ 8, ఇంజనీరింగ్ మూడు, వెటర్నరీ సెక్షన్, శానిటేషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రెండు, స్పోర్ట్స్ సెక్షన్‌కు ఒకటి చొప్పున విన్నపాలు అందాయని అధికారులు పేర్కొన్నారు. ఆరు జోన్లలో 66 ఆర్జీలను స్వీకరించగా, కూకట్‌పల్లి జోన్‌లో 36, ఎల్బీనగర్‌లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 8, శేరి లింగంపల్లిలో రెండు, ఖైరతాబాద్ జోన్‌లో నాలుగు, చార్మినార్ జోన్‌లో ఆరు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా రెండు విన్నపాలు స్వీకరించామని, వాటి పరిష్కారానికి ఆయా విభాగాలకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళినీ పద్మావతి, గీతా రాధిక, సత్యనారాయణ, రఘుప్రసాద్, సుభ్రదా దేవి, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, జల మండలి జీఎం సాయి రమణ పాల్గొన్నారు.

ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్లు ముకుంద్ రెడ్డి, వదిరవన్

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు ముకుంద్ రెడ్డి, కదిరవన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 490 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. అందులో గృహ నిర్మాణ శాఖకు 419 ఫిర్యాదులు రాగా, 34 పింఛన్లకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు ఆశన్న, కోటజీ, ఇలియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన సర్వే ఎంట్రీ ప్రక్రియ

21.42% మాత్రమే సర్వే వివరాలు నమోదు

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఇంటింటి కుటుంబ సర్వేలోనే కాదు.. వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియ నత్తనడకన జరుగుతున్నది. ఈ నెల 9వ తేదీ లోపు డేటా ఎంట్రీ పూర్తి చేసుకుని ఈ నెల 9వ తేదీ రిపోర్టు ఇవ్వాలని కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేయగా, 95 శాతంలో సోమవారం నాటికి కేవలం 21.42 శాతం మాత్రమే పూర్తి కావడం గమనార్హం. ఈ ప్రక్రియను బట్టి చూస్తే ఈ నెలాఖరు వరకు సమయం తీసుకునే అవకాశాలు కనబడుతున్నారు. గ్రేటర్‌లో ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయింది. సర్వే కోసం 20, 920 మంది ఎన్యూమరేటర్లు, 1728 మంది సూపర్ వైజర్లు పనిచేశారు. ఇందులో ప్రభుత్వ టీచర్లు, బల్దియా ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంతో పాటు ప్రైవేట్ టీచర్లు ఉన్నారు. గత నెల 6వ తేదీన సర్వే మొదలు కాగా, మొదటి మూడు రోజులలో ఇంటింటికి స్టిక్కర్లు వేశారు. 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేశారు. ఇందులో 95 శాతం మంది వివరాలను విజయవంతంగా సేకరించారు. మిగతా 5 శాతం మందిలో కొందరు తమ సొంతూర్లలో వివరాలు ఇస్తామని, మరి కొందరు వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. మొత్తంగా గ్రేటర్‌లో 29, 58,277 కుటుంబాలు ఉండగా, 1,47,913 మంది కుటుంబాలు వివిధ కారణాలు చెప్పి సర్వే వివరాలు ఇవ్వలేదు. ఐతే, డేటా ఎంట్రీ నమోదులో భాగంగా 33 సెంటర్లను ఏర్పాటు చేశారు. 2,300 ఆపరేటర్లు, 2,250 కంప్యూటర్లలో డేటా ఎంట్రీ ప్రక్రియను చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 4,37,789 కుటుంబ వివరాలను డేటా ఎంట్రీ చేశారు. రోజుకు దాదాపు లక్షా పది వేల దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటం గమనార్హం.

దేవాలయ అభివృద్ధికి కృషి

చౌటుప్పల్, డిసెంబర్ 9 : దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉబ్బు వరమ్మ, మాజీ సర్పంచ్ దైద మోహన్‌రెడ్డి, నాయకులు కొండూరు వెంకటయ్యగౌడ్, రావుల స్వామి, కేతరాజు అచ్చయ్య, కేతరాజు గోపాల్, సామకూర రాజయ్య, సామకూర యాదయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

సీసీ, డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 9 : పట్టణంలోని 1, 15వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. 1వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.6లక్షలతో చేపట్టనున్న సీసీ, డ్రైనేజీ, డ్రైనేజీ స్లాబ్ నిర్మాణ పనులు, 15వ వార్డులో రూ.6లక్షలతో చేపట్టనున్న సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్లు కుశంగుల ఎల్లమ్మ, రజియా రెహమాన్ పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఎంపిక

భువనగిరి అర్బన్, డిసెంబర్ 9 : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 8న జరిగిన ఇంటర్ కాలేజీ వాలీబాల్ సెలక్షన్స్‌లో పట్టణంలోని లక్ష్మీనర్సింహస్వామి కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచిసౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో క్రీడాకారులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జరిగే సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు కళాశాలకు చెందిన క్రీడాకారులు ఎం.సాయితేజ, టి.మహేశ్, మత్స్యగిరి పాల్గొంటారని తెలిపారు. అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ గంజి రమేశ్, పాండు రంగం, కె.కిష్టయ్య, బాల్‌రెడ్డి, స్నేహలత, సుధ, జగన్నాథ్ ఉన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మొక్కలు నాటి సంరక్షించాలి : మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 9 : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం 13వ వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, అంగన్‌వాడీ టీచర్ జంగమ్మ పాల్గొన్నారు.

13వ వార్డులో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

చేనేత కళాకారుల అభ్యున్నతికి కృషి

హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్

వెంగళరావునగర్, డిసెంబర్ 9: తెలంగాణ చేనేతకళాకారులకు పొదుపు బీమాతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారి ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలంగాణ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట సోమవారం ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. సిల్క్ ఎగ్జిబిషన్‌లో చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలు లభిస్తాయని, దేశంలోని అన్ని ప్రాంతాల చేనేత కళాకారులను ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌లను ప్రశంశించారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో చేనేత కళాకారుల ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని, దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్ లో ఏర్పాటు చేసినట్టు సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, ఇక్కత్‌తో పాటు పలు నగరాలను చెందిన విభిన్నమైన చీరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఈ నెల 15 వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్, డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్, శ్రీదేవి, వై.శైలజ పాల్గొన్నారు.

చీరలను పరిశీలిస్తున్న తెలంగాణా హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 9 : పట్టణంలోని అంగన్‌వాడీ -1 కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి సోమవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.పద్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ జంగమ్మ, పాల్గొన్నారు.

బొమ్మలరామారం : అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సోమవారం యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు తేజ, కరుణ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎయిర్ పిస్టల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 9 : తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన అండర్ 19 ఎయిర్ పిస్టల్ కాంపిటిషన్‌లో మండలంలోని పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట పవన్ రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించాడు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ కాంపిటిషన్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన పవన్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన పవన్‌ను ఉపాధ్యాయులు, బంధువులు అభినందించారు.

సిల్వర్ మెడల్ సాధించిన పవన్

ఆలేరులో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

ఆలేరు టౌన్, డిసెంబర్ 9 : అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సోమవారం ఆలేరు పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఆలేరు పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి దుర్గమ్మ గుడి, వివేకానంద చౌరస్తా మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డీసీపీ వినోద్ గోపి, పట్టణ ఎస్ఐ రజనీకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరులో కవాతు నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్